కథ

# లోపలి మనిషి

పాలపర్తి జ్యోతిష్మతి

సుజాత నా ప్రాణస్నేహితురాలు. మేమిద్దరం ఒకటో క్లాసు నించీ డిగ్రీ దాకా కలిసి చదువుకున్నాం. డిగ్రీ అయిపోగానే నేను బియిడిలో చేరాను. సుజాతకు పెళ్ళి చేసేశారు. మా స్నేహాన్ని విడదీయడం దేవుడికి కూడా ఇష్టం లేనట్టుంది. బియిడి అయిపోగానే నాకు సుజాత ఉండే ఊళ్ళోనే ఉద్యోగం వచ్చింది. ఇద్దరం వారానికి రెండు సార్లయినా కలుస్తాం. సినిమాలు, టీవీ కార్యక్రమాలు, రాజకీయాలు, సంగీతం, సాహిత్యం, మా చిన్ననాటి స్నేహితులు, బంధువులు, అమ్మానాన్న, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు - ఇట్లా ఏ విషయం గురించైనా అరమరికలు లేకుండా గంటలు గంటలు మాట్లాడు కుంటూ కూర్చుంటాం. కానీ ఎప్పుడూ సుజాత భర్త గురించి ఏమీ చెప్పేది కాదు. 'సభ్యత కాదు' అన్న ఉద్దేశంతో నేనూ ఏమీ అడిగేదాన్ని కాదు.

చిన్నప్పట్నించీ నాకు సుజాతకూ పుస్తకాలు చదవడం చాలా ఇష్టం. కాలేజీలో చేరాక మాకు ఇంకొంత మంది స్నేహితులు తోడయ్యారు. చదివిన విషయాల గురించి అందరం చర్చించుకునే వాళ్ళం. ముఖ్యంగా సాహిత్యం గురించి నేను మాట్లాడుతుంటే అందరూ చాలా మెచ్చుకునేవాళ్ళు. 'ఇన్ని పుస్తకాలు చదువుతావు, ఇంత బాగా మాట్లాడతావు కదా! నువ్వు కూడా ఏదైనా రాయకూడదూ?' అనేవాళ్ళు. కానీ నేను వాళ్ళ మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసేదాన్ని. 'అది నా వల్ల అయ్యే పని కాదులే' అంటూ.

సుజాతకు ధాటిగా మాట్లాడ్డం చేతకాదు. తను ఎప్పుడూ ఏమీ మాట్లాడకపోయినా తన మనసునిండా బోలెడు భావుకత ఉందని మాకందరికీ తెలుసు. సుజాత తన మనసులోని భావాల్ని నాకు చెప్పి "కథగానీ, కవితగానీ రాయరాదూ!" అనేది.

"చదవడం, మాట్లాడడమే వచ్చునాకు. రాయడం నా పని కాదు. అయినా నీ భావాలతో నేనెట్లా రాస్తాను" అనేదాన్ని నేను.

ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని చర్చలు చేసినా ఒక్క రచయితనైనా కలుసుకునే అవకాశం రాలేదన్న అసంతృప్తి నా మనసులో ఉండేది.

సుజాత భర్త శంకర్రావు కథా రచయిత కావడంతో ఆ లోటు కూడా తీరిపోయింది. ముచ్చటైన జంట అనుకున్నాం స్నేహితులమంతా.

నేను సుజాతా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు శంకర్రావు ఇంట్లో ఉంటే అతనితో మాట్లాడి సాహిత్యంలో నాకు తెలీని విషయాలు తెలుసుకుం టుంటాను. కానీ సుజాత ఏ మాత్రం ఆసక్తి చూపించదు. నేనూ, అతనూ మాట్లాడు కుంటుంటే వంటింట్లో పని చేసుకుంటూ ఉంటుంది. అదేమిటని అడిగితే "నేను కొన్నివిషయాలు చెప్తాను. ఆయనకి పోటీగా నువ్వురాయి" అంది.

"తల్లీ! నన్నొదిలి పెట్టు" అని ఒక నమస్కారం పెట్టాను.

ఒకసారి నేను వెళ్ళేటప్పటికీ సుజాత వంటింట్లో అలమర సర్దుతోంది.

"ఏం చేస్తున్నావ్?" అడిగాడు శంకర్రావు.

"అలమర నిండా చీమలు చేరాయి. అందుకని 'హిట్' కొట్టి కాయితాలు మార్చి సర్దుతున్నాను" చెప్పింది సుజాత.

"హిట్‌కొడితే చీమలు చచ్చిపోవూ? చీమలు చావకుండా, ఆ వైపు రాకుండా చేసే మందే దైనా వెయ్యాలి. అంతే కానీ అట్లా చీమలన్నిటినీ చంపడం తప్పు కదూ?" అంటూ మందలించాడు. నిజంగా నాకు చాలా ఆశ్చర్యం వేసింది. 'ఈ కాలంలో

కూడా ఇంత అహింసా వాదులున్నారా?' అని. 'ఇంత మంచి మనిషికి పోటీగా నన్నేదో రాయమంటుం దేంటి?' అని దాన్ని తిట్టుకున్నాను.

"ఒక ప్రముఖ మాసపత్రిక నిర్వహించిన కథల పోటీలో నాకు ప్రథమ బహుమతి వచ్చింది. స్నేహితులంతా కలిసి ఇవాళ సాయంత్రం అభినందన సభ ఏర్పాటుచేశారు మా ఇంట్లోనే. మీరు తప్పకుండా రావాలి" ఒకరోజు శంకర్రావు ఫోన్‌చేసి చెప్పాడు నాకు. ఒక్క క్షణం 'ఇప్పటిదాకా సుజాత ఈ విషయం నాకు చెప్పనేలేదే!' అనిపించినా పనిధ్యాసలో పడి ఆ విషయం అంతగా ఆలోచించలేదు నేను.

సాయంత్రం బళ్ళో పని పూర్తిచేసుకుని, ఇంటికెళ్ళి స్నానం చేసి తయారయ్యి సుజాతా వాళ్ళింటికి వెళ్ళాను.

అప్పుడే సభ మొదలుకాబోతోంది.

ఇంటిముందున్న ఖాళీ స్థలంలో చిన్న వేదిక ఏర్పాటుచేశారు. వచ్చిన వాళ్ళు కూర్చోడానికి వేదిక ముందు అర్ధచంద్రాకారంలో ప్లాస్టిక్ కుర్చీలూ, వేదిక మీద అతిథులకోసం పేము కుర్చీలూ వేసి ఉన్నాయి. వేదికకి అటూ ఇటూ రంగురంగుల గులాబీపూల కుండీలు పెట్టారు. వేదిక అలంకరణ సుజాత అభిరుచిని ప్రతిబింబిస్తూ ఉంది.

ఒక కుర్చీలో కూర్చుంటూ అటూ ఇటూ చూశాను. సుజాత ఎక్కడా కనిపించలేదు. 'ఏమిటో దీని వాలకం' మనసులోనే సుజాత మీద విసుక్కుని సభ మొదలవడంతో దృష్టి అటువైపు మరల్చాను.

వక్తలందరూ శంకర్రావు కథనూ, అతని రచనా నైపుణ్యాన్నీ అభ్యుదయ భావాల్నీ పొగుడుతూ ఉపన్యసించారు. ఇటువంటి బహుమతులు ఇంకా ఇంకా రావాలని ఆకాంక్షించారు. స్నేహితులంతా శంకర్రావుని అభినందనల్లో, శాలువాల్లో, పూల దండల్లో ముంచెత్తారు. సభ ముగిశాకగానీ ఈ లోకంలోకి రాలేకపోయాను. 'తన భర్తకి ఇక్కడ ఇంత గొప్పగా సన్మానం జరుగుతుంటే ఇదేంటి బయటికి కూడా రాకుండా లోపలే ఉండిపోయింది' ఆశ్చర్యపోతూ సుజాతతో మాట్లాడదామని లోపలి కెళ్ళాను.

"ఏంటే, బయటికి మొహం కూడా చూపించకుండా లోపలే ఉండిపోయావు?" వంటింట్లో కూర్చుని ఉన్న సుజాత దగ్గరికెళ్ళి అడిగాను.

"దగ్గరి స్నేహితులు ఒక పదిమందికి భోజనం ఏర్పాటు చెయ్యమన్నారు. ఇప్పటిదాకా ఆ పనే సరిపోయింది." నీరసంగా సమాధానం చెప్పింది సుజాత.

"ఏంటి అంత నీరసంగా ఉన్నావు? ఒంట్లో బాగా లేదా?"

"సభ ఏర్పాట్లకోసం తోట బాగుచేస్తుంటే గాజుపెంకు గుచ్చుకుంది" ఎర్రగా ఇంతలావున వాచి ఉన్న కాలిని చూపిస్తూ చెప్పింది సుజాత.

"బాగా రక్తం పోయిందా? డాక్టరు దగ్గరికెళ్ళావా? కుట్లేమైనా పడ్డాయా" కంగారుగా అడిగాను.

"కుట్లేమీ వెయ్యక్కర్లేదన్నారు. కట్టుకట్టి యాంటీబయాటిక్సూ, పెయిన్ కిల్లర్సూ ఇచ్చారు. కానీ నొప్పి తగ్గలేదు"

"టాబ్లెట్స్ వేసుకుని పడుకుంటే నొప్పి తగ్గుతుంది కానీ తిరుగుతూనే ఉంటే ఎట్లా తగ్గుతుంది? అయినా ఆ పనంతా నీకెందుకు? ఎవరైనా కుర్రాణ్ణి పెట్టి చేయించొచ్చు కదా?"

"సభ ఏర్పాట్లు అందంగా, ఆకర్షణీయంగా, ఆయన స్నేహితులు మెచ్చుకునే విధంగా నేనైతేనే చెయ్యగలనట. నన్నే చెయ్యమన్నారు?" నిర్వికారంగా చెప్పింది సుజాత.

"నాకు ఫోన్‌చేసి పిలిస్తే సెలవు పెట్టి వచ్చి సహాయం చేసేదాన్ని కదా? మన మధ్య ఉన్న స్నేహం విలువ ఇంతేనా?" నిష్ఠూరంగా అన్నాను.

"నీకు సెలవులు ఉన్నాయో లేదో! ఇప్పటికిప్పుడు సెలవు పెట్టడానికి కుదురుతుందో లేదో అని..." ఏదో ఒక సమాధానం చెప్పాలిగదా అన్నట్టు చెప్పింది సుజాత.

"పోనీ వంట మనిషినైనా పిలవలేక పోయావా? ఆ కాలితో అట్లా తిరుగుతూ ఇంత పని చెయ్యడమేంటి?" బాధగా అన్నాను.

"మీరు మరీ అంతగా ఫీలైపోకండీ! పది మందికి వంట చెయ్యడం కూడా పెద్దపనేనా? మీ ఫ్రెండేం అరిగిపోలేదులెండి. రేపీపాటికి పరుగెత్తుతుంది." ఎప్పుడొచ్చాడో శంకర్రావు గుమ్మంలో నిలబడి అన్నాడు. పీక పిసికేద్దామన్నంత కోపం వచ్చిందినాకు అతని మీద.

అతను అదేం పట్టించుకోకుండా "వడ్డించు, వాళ్ళని పిలుచుకొస్తాను" ఆర్డరేసినట్టు అనేసి బయటికెళ్ళిపోయాడు.

"మీరు కూడా భోజనానికి కూర్చోండి" అంటూ అతనెంత బలవంతం చేసినా వినిపించుకోకుండా సుజాతను కూర్చోబెట్టి వడ్డనంతా నేనే చేశాను. వాళ్ళ భోజనాలయ్యాక సుజాతకు పెట్టి నేనూ తిని వంటిల్లంతా సర్ది శుభ్రంచేశాను.

"రేపొద్దున్న వస్తాను. అవసరమైతే సెలవు పెట్టి నీ దగ్గరే ఉంటాను. జాగ్రత్తగా ఉండు. ఎక్కువగా తిరక్కు" సుజాతకు చెప్పి బయటకు నడిచాను. నా వెనకే కుంటుకుంటూ వచ్చింది సుజాత.

నాకోపం చల్లార్చడానికి పెద్ద జోకేస్తున్నట్టుగా అన్నాడు శంకర్రావు "దేవుడు నాకు చాలా అన్యాయం చేశాడండీ"

విసుగ్గా ఏమిటన్నట్టు చూశాను అతని వైపు.

"ఒక కుంటి అమ్మాయిని నాకు భార్యగా ఇచ్చాడు" తన జోక్‌కి తనే గట్టిగా నవ్వాడు.

కిటికీ తలుపులు వేసే నెపంతో సుజాత అటు తిరిగింది. తన కళ్ళలో కదలాడిన కన్నీటిపొరని నా కళ్ళు చూడలేకపోయినా నా మనసు చూడగలిగింది. ఎట్లా వచ్చానో తెలీకుండా ఇంటికొచ్చి పడ్డాను. పడుకున్నానన్నమాటేగానీ నిద్ర పట్టట్లేదు. అసహనంగా అటూ ఇటూ దొర్లుతున్నాను. శంకర్రావు మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. మనసంతా కెలికేసినట్టుగా ఉంది. ఏవేవో ఆలోచనలు- గజిబిజిగా. టైం ఒంటిగంటైంది. లేచి కూర్చున్నాను. మనసులో చెలరేగే భావతరంగాల తాకిడికి తట్టుకోలేక వాటిని కాగితం మీద కుమ్మరించాను. మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను కొన్ని మార్పులు చేశాను. తిరిగి ఒక క్రమ పద్ధతిలో రాశాను. మళ్ళీ చదువుకున్నాను. ఒక శక్తివంతమైన స్త్రీవాద కవిత రూపుదిద్దుకుంది.

శంకర్రావు 'లోపలి మనిషి' నా 'లోపలి మనిషి'ని నిద్రలేపాడు. పదునైన సాహిత్యంతో శంకర్రావు లాంటి మేకవన్నె పులుల కళ్ళు తెరిపించాలన్న దృఢ సంకల్పంతో నిద్రకుపక్రమించాను.



కీ. శే. మండలి వెంకట కృష్ణారావు స్మారక నాటక రచన పోటీలలో 'మందు' నాటక రచయిత శ్రీ వై. శ్రీరాములుగారికి అత్యుత్తమ రచనా పురస్కారాన్ని అందజేస్తున్న శాసనమండలి ఛైర్మన్ శ్రీ చక్రపాణి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, ఎం.పి. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కోనేరు రంగారావు, సామల రమేష్, ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, విజయవాడ ఎమ్మెల్యే మరియు మేయర్